సాక్షి
వికారాబాద్

సోమవారం । 4 । మార్చి । 2024



అనుమతి ఒకటి..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికి తక్కువ ధరకే ఇసుక అందివ్వాలనే ఉద్దేశంతో జారీ చేసిన అనుమతులు పక్కదారి పడుతున్నాయి 8లో▸



ఎల్లమ్మా.. నీవే దిక్కమ్మ

పోలెపల్లి ఎల్లమ్మ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు ప్రత్యేక పూజలు అందుకున్నారు. 8లో▸



నిండు జీవితానికి..

వికారాబాద్ వ్యాప్తంగా ఆదివారం పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. 9లో▸

న్యూస్‌రీల్

పల్స్ పోలియో విజయవంతం

- జిల్లా వ్యాప్తంగా 94 శాతం పూర్తి
- డీఎంహెచ్ఓ పల్వన్‌కుమార్



తట్టెపల్లిలో పల్స్ పోలియో కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ పల్వన్‌కుమార్

పెద్దేముల్: జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం మొదటి రోజు విజయవంతమయిందని, రెండవ రోజు ఇంటింటి సర్వేను విజయవంతం చేయాలని జిల్లా ఆరోగ్య వైద్యాధికారి(డీఎంహెచ్ఓ)పల్వన్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తట్టెపల్లి, ఆత్కూర్, ఇందూరు, కందనెల్లితండా, గాజీపూర్‌తో పాటు పలు గ్రామాల్లో ఆయన పర్యటించి పల్స్ పోలియో కేంద్రాలను పరిశీలించారు. మండలంలో 26 కేంద్రాల్లో పోలియో చుక్కలు వేస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 94శాతం, పెద్దేముల్ మండల పరిధిలో 96 శాతం చిన్నారులకు చుక్కలు వేసినట్లు వివరించారు. రెండవ రోజు ఇంటింటికి వెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. వలస వచ్చిన చిన్నారులకు తప్పకుండా వేయాలని ఏఎన్ఎంలకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ మానిటర్ బద్రీనాథ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ జీవన్‌రాజు, పెద్దేముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్ డీఎస్పీగా శ్రీనివాస్‌రెడ్డి

అనంతగిరి: ఎన్నికల నేపథ్యంలో వికారాబాద్ డీఎస్పీ అంజయ్య బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో డీఎస్పీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎన్. శ్రీనివాస్‌రెడ్డిని వికారాబాద్ డీఎస్పీగా నియమించారు. కాగా అంజయ్యను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలిచ్చారు. అంజయ్య ఇటీవలె వికారాబాద్ డీఎస్పీగా బదిలీపై వచ్చారు.

పేదలకు నష్టం కలిగించొద్దు

మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయకర్త వసంతలక్ష్మి

కొడంగల్: ప్రభుత్వం పేదలకు నష్టం కలిగించే చర్యలను మానుకోవాలని మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయకర్త వసంతలక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిరుపతయ్య అన్నారు. ఆదివారం వారు మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలో అసైన్‌మెంట్ భూములను సాగు చేసుకుంటున్న రైతుల వివరాలను సేకరించారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ.. అసైన్‌మెంట్ భూములను ప్రభుత్వం తిరిగి తీసుకోవడంతో పేద రైతులకు నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్ రాజు, హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి సంజీవ్, రైతు కూలి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి, కేఎస్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏర్పుల చంద్రప్ప, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తూరు చంద్రయ్య, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్, అంబేడ్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రమేశ్‌బాబు, ఎరన్‌పల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బైండ్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మణ్

అనంతగిరి: బైండ్ల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వికారాబాద్‌లోని రైల్వే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా రాములు, ఉపాధ్యక్షుడిగా నర్సింలు. సలహాదారులుగా బిచ్చన్న, కోశాధికారిగా శ్రీనును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో సంఘాన్ని బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి యాదగిరి, కిష్టయ్య, కుమార్, అన్నారం శ్రీను, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పహాడీ షరీఫ్ దర్గాలో ఎంపీ రంజిత్ ప్రార్థనలు

పహాడీషరీఫ్: పహాడీ షరీఫ్ దర్గా 758వ ఉర్సు షరీఫ్ ఉత్సవాల్లో భాగంగా చేవెళ్ల ఎంపీ డాక్టర్ జి.రంజిత్ రెడ్డి ఆదివారం రాత్రి పూలు, చాదర్ సమర్పించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది, నాయకులు సయ్యద్ యూసుఫ్ పటేల్, కొండల్ యాదవ్, రాజేష్, ఎక్బాల్ ఖలీఫా తదితరులు పాల్గొన్నారు.

పచ్చ‘ధనం’ మాయం!

- ఒక్కో మున్సిపాలిటీకీ రూ.ఆరు కోట్ల నుంచి రూ.15 కోట్ల వరకు గ్రీన్ బడ్జెట్
- నిర్వహణ పేరిట నిధుల స్వాహా
- పట్టించుకోని ఉన్నతాధికారులు



వికారాబాద్: పక్క ఫొటోలో కనిపిస్తున్న పార్కు పరిగి లోని తిరుమల, మైత్రి వెంచర్ల మధ్య ఏర్పాటు చేశారు. వెంచర్ల నిర్వహకులు పార్కు నిర్మాణం చేపట్టగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. ఇందుకు గ్రీన్ బడ్జెట్ నుంచి నిధులు ఖర్చు చేశారు. మొదట్లో నాటిన మొక్కలకు గార్డులు ఏర్పాటు చేశారు. అనంతరం వాటి సంరక్షణ గాలికి వదిలేశారు. దీంతో బీడుగా మారిపోయింది. ఇది ఒక ఉదాహరణ మాత్రమే.. ప్రస్తుతం మున్సిపాలిటీల్లో ఉన్న సగానికి పైగా పార్కులదీ ఇదే దుస్థితి. అధికారులు మాత్రం 80 శాతానికి పైగా మొక్కలు సంరక్షించామని చెబుతున్నారు.

కానరాని నిర్వహణ

జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు (వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్) ఉండగా ఒక్కో మున్సిపాలిటీలో 10 నుంచి 30 పార్కుల వరకు మొత్తంగా 80 పైచిలుకు పార్కులున్నాయి. వీటన్నింటిలోనూ హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటారు. అనంతరం గ్రీన్ బడ్జెట్ పేరిట మున్సిపాలిటీల ద్వారా లక్షల రూపాయల నిధులు ఖర్చు చేస్తూ వస్తున్నారు. నిధులు మంచు గడ్డలా కరుగుతున్నాయే తప్ప పార్కుల నిర్వహణ మాత్రం ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించటంతో స్థానిక మున్సిపల్ అధికారులు నిధులు స్వాహా చేస్తున్నారు. ఇదే విషయంలో మున్సిపల్ కమిషనర్లపై కలెక్టర్ వరకు ఫిర్యాదులు అందాయి. మున్సిపల్ సర్వసభ్య సమావేశాల్లో ప్రతిపక్ష కౌన్సిలర్లు నిలదీసినా పరిస్థితిలో ఏ మాత్రం మార్పు రావడంలేదు.

సంయుక్తంగా స్వాహా..?

మున్సిపాలిటీల్లో ఎంతో ఉన్నతాశయంతో ప్రభుత్వం రూపొందించిన గ్రీన్ బడ్జెట్ పూర్తిగా పక్కదారి పడుతోంది. ప్రతీ మున్సిపాలిటీ పరిధిలో వారి వార్షిక బడ్జెట్‌లో 10 శాతం గ్రీన్ బడ్జెట్ కింద కేటాయిస్తారు. ఈ నిధులను మున్సిపల్ పరిధిలో నాటే మొక్కలు, వాటి సంరక్షణ, పార్కుల నిర్వహణ తదితర పనులకు ఖర్చు చేస్తారు. జిల్లాకు చెందిన ఒక్కో మున్సిపాలిటీలో రూ. 6 కోట్ల నుంచి రూ.15 కోట్ల వరకు వార్షిక బడ్జెట్ ఉంది. ఈ లెక్కన ఒక్క మున్సిపాలిటీ పరిధిలో ప్రతి ఏడాది పచ్చదనం కోసం రూ.50 లక్షల నుంచి కోటిన్నర వరకు ఖర్చు చేస్తున్నట్లు రికార్డులు చూపుతున్నాయి. వాస్తవంగా ఈ నిధుల్లో 50 శాతం కూడా ఖర్చు చేయకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు కుమ్మక్కై స్వాహా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ట్రీ గార్డులు, నీటి సరఫరా, సంరక్షణ తదితర పేర్లతో బిల్లులు పెట్టి నిధులు స్వాహా చేస్తున్నారు. కొన్ని చోట్ల వెంచర్ నిర్వహకులు ఏర్పాటు చేసిన పార్కులకు సంబంధించి కొందరు కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ల అండదండలతో నిధులు స్వాహా చేశారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

పర్యవేక్షణ కరువు

మున్సిపాలిటీల్లో పచ్చదనం విషయంలో అధిక మొత్తంలో నిధులు ఖర్చు చేస్తున్నా.. ఉన్నతాధికారులు పర్యవేక్షణ గాలికొదిలేశారు. హరితహారం సమయంలో మొక్కలు నాటి హడావుడి చేస్తున్న ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేలు లాంటి ప్రజాప్రతినిధులు తిరిగి అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో లక్షల్లో నిధులు ఖర్చు అవుతున్నాయే తప్ప పార్కులు పచ్చదనాన్ని మాత్రం సంతరించు కోవటం లేదు. గ్రీన్ బడ్జెట్ పక్కదారి పడుతుందని, నిధులు స్వాహా అవుతున్నాయని అనేక సందర్భాల్లో మున్సిపాలిటీల జనరల్ బాడీ సమావేశాల్లో రచ్చ జరుగుతున్నా అధికారులు పట్టించుకున్న పాపాన పోవడంలేదు. ఈ విషయంలో గతంలో అనేక సార్లు కలెక్టర్ వరకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవటంతో పార్కుల నిర్వహణ గాలికొదిలేస్తూ నిధుల స్వాహా యథాతథంగా కొనసాగిస్తున్నారు.



విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ఛత్రపతి యువతకు ఆదర్శం

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల: ఛత్రపతి శివాజీని యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అగ్గనూరులో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహావిష్కరణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిన్న వయసులోనే యుద్ధాలు గెలిచిన వ్యక్తిగా శివాజీ పేరు గడించారన్నారు. దేశం, ధర్మం, హైందవం కోసం పోరాటం చేసిన వ్యక్తిగా శివాజీకి గుర్తింపు ఉందన్నారు. నేటి యువత శివాజీని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. అనంతరం స్థానిక యువకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, యాలాల సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భీమప్ప, నాయకులు అడ్వకేట్ శ్రీనివాస్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

గోసంరక్షణకు కట్టుబడిన గొప్ప వ్యక్తి

ఛత్రపతి శివాజీ మహారాజ్ గోసంరక్షణ బాధ్యతలు తీసుకుని హైందవ ధర్మాన్ని రక్షించాడని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. ఆదివారం ఆయన అగ్గనూరులో స్థానిక యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో భారత్.. హిందూ దేశంగా మారుతుందన్నారు. యువత హైందవ ధర్మాన్ని బోధించి ప్రచారం చేసే వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ లాంటి సంస్థల్లో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే అయోధ్యలో రామమందిరం నిర్మాణం పూర్తయిందని, భవిష్యత్‌లో కాశీ, మధురలోనూ ఇదే మార్పు రానుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భీమప్ప, వివేకానంద యువజన సంఘం ప్రతినిధులు వీరేశం, శ్రీశైలం తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్న కేంద్రం

- రాజకీయ ప్రత్యర్థులపై కావాలనే దాడులు
- కేసీఆర్ అవినీతిపై విచారణ చేసే దమ్ముందా?
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

షాద్‌నగర్: కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీ, ఐటీలతో బీజేపీ ప్రభుత్వం రాజకీయ ప్రత్యర్థులపై ముప్పేట దాడులు చేయిస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. షాద్‌నగర్ పట్టణంలోని ఎన్‌హెచ్ 44దాబా వద్ద ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రం దర్యాప్తు సంస్థలను తమ చెప్పుచేతల్లో పెట్టుకుందని.. రాజకీయంగా తమకు ఎదురుండొద్దనే ఉద్దేశంతో ప్రతిపక్ష పార్టీల నేతల ఇళ్లపై దాడులు, అరెస్టులు చేయిస్తోందని ఆరోపించారు. కేసీఆర్ చేసిన అవినీతిపై విచారణ చేసే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులను అరెస్టు చేసి జైల్లో పెడతామని ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా చెప్పారని, మరి ఎందుకు వదిలేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒకటే అయినందుకే కేసీఆర్ అవినీతిపై చర్యలు తీసుకునేందుకు వెనుకంజ వేస్తోందని అన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టును తమ పార్టీ నేతలందరు కలిసి చూసేందుకు వెళితే బొందల గడ్డను చూసి ఏం పీకుతారన్న మాజీ సీఎం కేసీఆర్.. మరి బీఆర్ఎస్ నేతలు ఏం పీకడానికి వెళ్లారని నిలదీశారు. మేడిగడ్డను బొందల గడ్డగా మార్చిన ఘనత ఆయనకే దక్కిందని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 90 రోజులు పూర్తయిందని, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీల్లో దాదాపు అన్నింటినీ త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చబోతున్నారని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రజలకిచ్చిన మాటకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తెలంగాణ బద్ధ శత్రువు కేంద్ర మంత్రి అమిత్‌షా అని మంత్రి పొన్నం విమర్శించారు. పార్లమెంట్ సాక్షిగా తెలంగాణను వ్యతిరేకించిన వ్యక్తి ఇప్పుడు తెలంగాణకు ఏం న్యాయం చేస్తాడని ప్రశ్నించారు. సమావేశంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరకు రైతుకు చేదు

దళారులకు తీపి

- 40 ఏళ్లుగా తీరని గోస
- ఫ్యాక్టరీలు లేక తిప్పలు



పెద్దేముల్‌లో చెరకు కోతలు

పెద్దేముల్: చెరకు రైతును కష్టాలు వీడడం లేదు. పండించిన రైతులకు దళారులే దిక్కవుతున్నారు. చెరకు ఫ్యాక్టరీల యాజమాన్యం కోతల సమయంలో జాడ లేకుండా పోతున్నారు. దీంతో రైతుకు తీపి నివ్వాల్సిన పంట చేదునే పంచుతోంది. సుమారు 40 ఏళ్లుగా చెరకు ఫ్యాక్టరీ కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు దాటినా తమగోడు పట్టించుకునే వారే లేరని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. దివంగత సీఎం ఎన్టీఆర్ నాటి నుంచి నేటి వరకు రైతులు ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఎదురు చూస్తున్నారు. జిల్లాలోని పెద్దేముల్, బషీరాబాద్, కోట్‌పల్లి, ధారూరు, మర్పల్లి, మోమిన్‌పేట, బంట్వారం తదితర మండలాల్లో రైతులు సుమారు 30 ఏళ్లకు పైగా చెరుకు పంట సాగుచేస్తున్నారు. ఫ్యాక్టరీలు అందుబాటులో లేక.. యాజమాన్యాలు సమయానికి కోతలు చేపట్టక రైతులు ఇబ్బంది పడుతున్నారు.

దక్కని ‘మద్దతు’

మూడేళ్లుగా మద్దతు ధర లభించక రైతు ఏడాది పాటు కష్టం చేస్తే చివరకు పిప్పి తప్ప ఏదీ మిగలడం లేదంటున్నారు. ఫ్యాక్టరీలు అందుబాటులో లేక దళారులను ఆశ్రయించక తప్పడం లేదు. మార్కెట్లో టన్నుకు అసలు ధర రూ.3750, ట్రాన్స్‌పోర్టు, కోతలు పోగా రైతుకు రూ.2465 రైతు ఖాతాల్లో జమకావాలి. కాని సమయానికి కోతలు కాక రైతులు దళారులను ఆశ్రయిస్తే ఖర్చులు పోను టన్నుకు రూ.2వేల ధర మాత్రమే దక్కుతోందని రైతులు వాపోతున్నారు.

టన్నుకు రూ.4వేలు వస్తేనే గిట్టుబాటు

కొంత మంది దళారులు కోతలు చేసిన వెంటనే రూ.2వేల వరకు ఇస్తామంటూ రైతులను ముంచుతున్నారు. చెరకు ఫ్యాక్టరీలు లేక రైతులు యాద్గిర్, కొత్తకోట ప్రాంతాలకు తరలిస్తున్నారు. మరికొందరు సంగారెడ్డిలో గణేశ్ ఫ్యాక్టరీ అగ్రిమెంటు చేసిన రైతులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఏటా పెట్టుబడులు రెండింతలు పెరిగినా తమకు గిట్టుబాటు కావడం లేదని, పెట్టిన పెట్టుబడులకు టన్నుకు రూ.4వేలు చేసినా కష్టానికి ఫలితం వస్తుందంటున్నారు.

సబ్సిడీలకు మంగళం

ఓ ఎకరా భూమిల్లో చెరుకు పంట సాగు చేయాలంటే సుమారు రూ.45వేలు వరకు ఖర్చు అవుతోంది. ఎకరాకు 40టన్నుల పైగా దిగుబడి వస్తే, దానికి మద్దతు ధర టన్నుకు రూ.4వేలు వస్తే పెట్టుబడులు పోను చేసిన కష్టం మిగులుతుంది. గతంలో ప్రభుత్వం సబ్సిడీపై పురుగు మందులు, ఎరువులు ఇచ్చేది. క్రమంగా అవి కనుమరుగయ్యాయి. ఆశించిన దిగుబడి వచ్చినా కూలీల కొరత, విక్రయాల్లో ఇబ్బందులతో పంట సాగు తగ్గుతోంది.

“ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయాలి



రాష్ట్రం ఏర్పడితే యువతకు ఉద్యోగాలతో పాటు రైతులకు మంచి రోజులు వస్తాయని అనుకున్నాం. కానీ ఎవరికి లాభం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చెరకు ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయాలి. దళారుల వ్యవస్థను తొలగించి పంటలను నేరుగా విక్రయించేలా చూడాలి.

– రాంచంద్రయ్య, రైతు, బండమీదిపల్లి

సబ్సిడీపై ఎరువులు అందజేయాలి



చెరుకు రైతులకు విత్తనంతో పాటు ఎరువులను సబ్సిడీపై అందజేయాలి. గత ప్రభుత్వం సబ్సిడీ ఎరువులు పూర్తిగా రద్దు చేసిది. మళ్లీ కొత్త ప్రభుత్వం రైతులకు ఎరువులు సబ్సిడీపై అందచేయాలి. ఆసక్తి గల రైతులకు పంట కోత యంత్రాలు ఇవ్వాలి. అప్పుడే రైతులకు వ్యవసాయం పై ఆసక్తి పెరుగుతుంది.

– అజీం, రైతు, పెద్దేముల్



హెల్మెట్ ధరించి ర్యాలీలో పాల్గొన్న వాహనదారులు



చిన్నారులు, తల్లిదండ్రులకు హెల్మెట్‌లు పంపిణీ చేస్తున్న అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్

రైడ్ టు సేఫ్టీ

మీర్‌పేట: ప్రతి పౌరుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని రోడ్ సేఫ్టీ అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్ సూచించారు. ఐసీఐసీఐ లాంబార్డ్, ట్రాక్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని లార్స్ స్కూల్ వద్ద చేపట్టిన ‘రైడ్ టు సేఫ్టీ’ ర్యాలీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులు, తల్లిదండ్రులకు 818 హెల్మెట్‌లను పంపిణీ చేశారు. అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అడిషనల్ డీజీపీ మాట్లాడుతూ.. హెల్మెట్‌లు ధరించకపోవడంతో ప్రమాదాలు జరిగినప్పుడు తలకు గాయాలై చాలా మంది ప్రాణాలు కోల్పోయి ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని.. ఒక్క 2022 సంవత్సరంలోనే రాష్ట్రంలో 3 వేల మంది ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా మంది మొబైల్, మద్యంతాగి, సీటుబెల్టు పెట్టుకోకుండా, రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్ చేస్తున్నారని.. ఇది చాలా ప్రమాదకరమని పేర్కొన్నారు. సెల్‌ఫోన్ కొన్నాక భద్రత కోసం స్క్రీన్‌గార్డు, పౌచ్ ఎలా కొనుగోలు చేస్తారో.. వాహనం నడిపేటప్పుడు సైతం అలాగే హెల్మెట్ ధరించి నడపాలని సూచించారు. ఐసీఐసీఐ లాంబార్డ్ వారు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, ఐసీఐసీఐ లాంబార్డ్ ప్రతినిధి సుమిత్‌శర్మ, ట్రాక్ సంస్థ ప్రతినిధులు కులశ్రేష్ఠ, రాజ్‌నాథ్‌శర్మ, రజినీగాంధీ, మీర్‌పేట సీఐ కాశీవిశ్వనాథ్, సిల్వర్ డ్రాప్స్ విద్యాసంస్థల చైర్మన్ జె.శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉ‘సిరి’

ఓ ఉసిరి చెట్టు విరగకాసి చూపరులను ఆకట్టుకుంటోంది. సర్దార్‌నగర్ గ్రామానికి చెందిన దాదె అమృత్‌రాజ్ ఇంటి వద్ద పెంచుకున్న ఉసిరి చెట్టుకు మొదలు నుంచి చివరి కొమ్మల వరకు కాపు విరగకాసింది. అటు వైపు వెళ్లేవారు దీనిని ఆసక్తిగా వీక్షిస్తున్నారు.

– షాబాద్



క్లుప్తంగా

అనుమానంతో భార్యను కడతేర్చిన భర్త


మృతురాలు ప్రమీల

పూడూరు: అనుమానంతో భర్త కర్రతో దాడి చేయడంతో భార్య మృతి చెందిన సంఘటన చన్గోముల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పరిగి సీఐ శ్రీనివాస్‌, చన్గోముల్‌ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డిలు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దేవనోనిగూడ గ్రామానికి చెందిన ప్రవీణ్‌, పరిగి మండలం రుకుంపల్లి గ్రామానికి చెందిన ప్రమీల(28)తో పదకొండేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి ఇద్దరు సంతానం. ప్రమీల పరిగిలో ఓ బట్టల దుకాణంలో పని చేస్తుంది. రెండేళ్ల నుంచి దంపతులు తరచూ గొడవలు పెట్టుకునేవారు. వివాహేతర సంబంధం నెపంతో భార్యను ప్రవీణ్‌ వేధించేవాడు. ఈ క్రమంలోనే శనివారం ఉదయం దంపతులు పొలం వద్దకు వెళ్లారు. అక్కడ ప్రమీలపై భర్త కర్రతో దాడికి పాల్పడటంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆమెను పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వికారాబాద్‌ మహవీర్‌ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ప్రమీల మృతి చెందింది. మృతురాలి తండ్రి కనకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పూడూరు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని రాకంచర్ల స్టేజీ వద్ద చోటు చేసుకుంది. అంగడిచిట్టంపల్లి గ్రామానికి చెందిన మధుమోహన్‌రెడ్డి పరిగిలో నివాసం ఉంటున్నాడు. స్వగ్రామం నుంచి బైక్‌పై పరిగి వెళ్తున్న ఆయన మార్గమధ్యలో రాకంచర్ల మలుపు వద్ద అదుపుతప్పి రోడ్డుపై వెళ్తున్న బిహార్‌ యువకున్ని ఢీకొట్టాడు. ప్రమాదంలో ఆ యువకుని కాలు విరిగింది. మధుమోహన్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలవడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

ఇబ్రహీంపట్నం రూరల్‌: కోడి పందేలపై పోలీసులు దాడి చేశారు. మూడు కోళ్లు, నగదు స్వాధీనం చేసుకొని, నలుగురిని అరెస్టు చేశారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. కుర్మల్‌గూడ శివారు ప్రాంతంలో పందెం కోళ్లను తీసుకొచ్చి పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు దాడి చేశారు. రూ.15,000 నగదు, మూడు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఒంగోలుకు చెందిన తన్నీరు శివ, జడ్చర్లకు చెందిన మీసాల ఆంజనేయులు, తిలక్‌నగర్‌ కాచిగూడకు చెందిన బచ్చలకూర జంగయ్య, వనస్థలిపురానికి చెందిన బండి రమేశ్‌లను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

8మంది జూదరుల అరెస్టు

మొయినాబాద్‌: పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి 8 మంది జూదరులను అరెస్టు చేశారు. వివరాలు.. మొయినాబాద్‌ మండల పరిధిలోని అజీజ్‌నగర్‌ శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రం షెడ్డులో అజీజ్‌నగర్‌, నాగిరెడ్డిగూడతోపాటు నగరానికి చెందిన రవి, యాదగిరి, సురేందర్‌, రాజు, మధు, మహేందర్‌, అశోక్‌, నాగరాజు ఆదివారం సాయంత్రం పేకాట ఆడుతున్నారు. సమాచారం అందుకున్న మొయినాబాద్‌ పోలీసులు దాడిచేసి 8 మందిని పట్టుకున్నారు. వారి దగ్గర ఉన్న రూ.47,500 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిని పోలీస్‌ స్టేషన్‌కు తరలించామని.. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అనుమతి ఒకటి .. నాలుగైదు లూటీ

- ఇసుక అనుమతులు పక్కదారి
- యథేచ్ఛగా తోడేస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు
- ఆదాయం కోల్పోతున్న ప్రభుత్వం

అక్రమార్జనే ధ్యేయంగా ఇసుక వ్యాపారులు రెచ్చిపోతున్నారు. ఒక ట్రిప్పునకు అనుమతి తీసి యథేచ్ఛగా నాలుగైదు ట్రిప్పులు తరలించుకొని కాసులు దండుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు పెద్ద ఎత్తున గండి పడుతోంది.


ఇసుక ట్రాక్టర్‌ను ఠాణాకు తరలిస్తున్న పోలీసులు (ఫైల్‌)

పెద్దేముల్‌: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికి తక్కువ ధరకే ఇసుక అందివ్వాలనే ఉద్దేశంతో జారీ చేసిన అనుమతులు పక్కదారి పడుతున్నాయి. పత్రాల్లో సాగుతున్న వ్యవహారానికి వాస్తవంగా చాలా వ్యత్యాసం ఉంది. ఒక ట్రిప్పునకు అనుమతి తీసుకొని యథేచ్ఛగా నాలుగు, ఐదు ట్రిప్పులు తరలించుకొని కాసులు దండుకుంటున్నారు. మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా అక్రమ ఇసుక వ్యాపారం జోరుగా సాగుతోంది. దీంతో ప్రభుత్వ ఖజానాకు పెద్ద ఎత్తున గండి పడుతోంది. రూ.600లతో డీడీలు చెల్లించుకుని పర్మిట్లు తీస్తున్నారు. ఇప్పటికే కొంత మంది ఇసుక వ్యాపారులు, అధికారులు కుమ్మక్కై రెండు ట్రిప్పులకు, నాలుగు ట్రిప్పులు, నాలుగుకి ఎనిమిది ట్రిప్పులు తరలిస్తున్నారు. అధికారులు మాత్రం పర్మిట్లు ఉన్న ట్రాక్టర్లను పట్టుకోవడం తప్ప, అనుమతులు లేకుండా ఇష్టం వచ్చినట్లు ఇసుకను తోడేస్తున్న ఇసుకాసురులను పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

అక్రమార్జనే ధ్యేయంగా

మండలంలోని కొండాపూర్‌, రుక్మాపూర్‌తో పాటు పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఇసుక రవాణా సాగుతుంది. పర్మిట్లు లేకున్నా ఉన్నాయంటూ కొంత మంది ఇసుక విక్రయాలు చేస్తున్నారు. గతంలో దళారులు రూ.3వేల నుంచి రూ.3200లకు ఇసుకను విక్రయించేవారు. ప్రస్తుతం ప్రభుత్వం రూ.600లకే ఇసుకను అందచేసినా దళారులు మాత్రం రూ.4వేల నుంచి రూ.5వేలకు ట్రిప్పును విక్రయిస్తున్నారు. సమయం, సందర్భం లేకుండా అక్రమార్జనే ధ్యేయంగా ఇసుకను తరలిస్తున్నారు. ఉదయం 9గంటలకే ఇసుక ట్రాక్టర్‌లు గ్రామాలకు చేరుతున్నాయి. సాయంత్రం ఆరు దాటినా కూడా అక్రమ ఇసుక వ్యాపారం ఆగటం లేదు. మండలంలో ఇసుక అక్రమ వ్యాపారం దొరకితే దొంగ.. లేదంటే దొర అన్నట్లు సాగుతుంది. ట్రాక్టర్‌లను పోలీసులు సీజ్‌ చేసినా వెంటనే దళారులు అద్దెకు వాహనాలను తీసుకొని వ్యాపారాన్ని సాగిస్తున్నారు. గతేడాది పెద్దేముల్‌ ఎస్‌ఐ చంద్రశేఖర్‌ ఏసీబీలకు చిక్కిన విషయం అందరికీ తెలిసిందే. అయినా ఇసుక అక్రమ వ్యాపారం ఆగటం లేదు. ఇప్పటికైనా ఈ వ్యవహారాన్ని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమంగా తరలిస్తే చర్యలు



ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఆయా గ్రామాలల్లో రెవెన్యూ సిబ్బందిని కాపలగా పెట్టి అక్రమ ఇసుక రవాణాను అడ్డుకునేలా చర్యలు చేపడుతాం. ఇందుకు గ్రామస్తులు సహకారం అందచేయాలి. ఇసుకకు తప్పకుండా డీడీలు చెల్లించాలి.
– కిషన్‌, తహసీల్దార్‌, పెద్దేముల్‌

ప్రతి ట్రాక్టర్‌ను చెక్‌ చేస్తాం



ఇక నుంచి ప్రతి ఇసుక ట్రాక్టర్‌లను చెక్‌ చేస్తాం. అనుమతులు లేని, సమయ పాలన పాటించని వాటిని సీజ్‌ చేస్తాం. అక్రమ ఇసుక ట్రాక్టర్‌లు తరలిస్తే తమకు ఫిర్యాదు చేయండి. ఒకటి, రెండుసార్లు పట్టుబడిన ట్రాక్టర్‌ను మూడోసారి పూర్తిగా సీజ్‌ చేస్తాం. ఇసుక ట్రాక్టర్‌ యజమానులు ఇష్టం వచ్చినట్లు తరలిస్తే ఊరుకునేది లేదు.
– గిరి, ఎస్‌ఐ, పెద్దేముల్‌

సిబ్బందిని నియమిస్తాం



మండలంలో ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలించకుండా చర్యలు తీసుకుంటాం. వాగుల వద్ద ఇసుక ట్రాక్టర్‌లు లోడ్‌ అయ్యో సమీపంలో మైన్స్‌ సిబ్బందితో పాటు రెవెన్యూ సిబ్బందిని కూడా నియమిస్తాం. పర్మిట్‌ కంటే ఎక్కువ ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు.
– జాకబ్‌, మైన్స్‌ ఏడీ, తాండూరు



బస్టాండ్‌ నిర్మించండి

మండల పరిధిలోని గోనూర్‌ గ్రామానికి వెళ్లే గేటు వద్ద బస్టాండ్‌ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవి కాలం సమీపిస్తున్న వేళ ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. తాండూరు–బషీరాబాద్‌ ప్రధాన రోడ్డు నుంచి రెండు కిలో మీటర్ల దూరంలో గోనూర్‌ గ్రామం ఉంది. గ్రామస్తులు బస్సు సౌకర్యం కోసం కాలినడకన ప్రధాన రోడ్డు గేటు వరకు వస్తారు. వేసవికాలం ఉండటంతో ప్రయాణికులు చెట్ల కింద సేద తీరుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గోనూర్‌ గేటు వద్ద బస్టాండ్‌ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.
– తాండూరు రూరల్‌

అర్ధరాత్రి గంధం చెట్ల అపహరణ

రూ.5 లక్షలకు పైగా నష్టం చేసిన దుండగులు


చౌదర్‌పల్లి గ్రామంలో దొంగలు నరికి ఎత్తుకెళ్లిన గంధం చెట్టు

యాచారం: శ్రీ గంధం చెట్ల నరికివేత దొంగల ముఠా శనివారం రాత్రి చౌదర్‌పల్లి గ్రామంలో హల్‌చల్‌ చేసింది. సాగర్‌రోడ్డుకు సమీపంలో గ్రామానికి చెందిన రంగయ్య వ్యవసాయ పొలంలో ఉన్న గంధం చెట్టును నరికి తీసుకెళ్లడానికి అర్ధరాత్రి వచ్చారు. అదే సమయంలో అటుగా వ్యవసాయ పొలానికి వెళ్తున్న జంగయ్య చెట్టును కొట్టే శబ్దాన్ని విని కేకలు వేశారు. దీంతో దొంగలు రాళ్లురువ్వడంతో జంగయ్య అక్కడి నుంచి పారిపోయాడు. వెంటనే ఆయన 100కు ఫోను చేశారు. పోలీసులు వచ్చేలోపే దొంగలు 15 ఏళ్ల వయసున్న రూ.5 లక్షలకు పైగా విలువ జేసే చెట్లను నరికి తీసుకెళ్లారు. కొద్ది రోజులుగా మండలంలోని నందివనపర్తి, గడ్డమల్లయ్యగూడ, గునుగల్‌ తదితర గ్రామాల్లోని వ్యవసాయ పొలాల వద్ద ఉన్న శ్రీ గంధం చెట్లను నరికి ఎత్తుకెళ్లడం పరిపాటిగా మారింది. రైతు ఫిర్యాదు మేరకు యాచారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవాలయాలే టార్గెట్‌

- అమ్మవారి మంగళసూత్రం ఎత్తికెళ్లిన దొంగ అరెస్టు
- నిందితుడిపై 30 పాత కేసులు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాఘవేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్‌: దేవాలయాలను టార్గెట్‌ చేసుకొని చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. ఆదిబట్ల పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని బొంగ్లూర్‌ కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో గతనెల 26న అమ్మవారి మెడలో ఉన్న మంగళసూత్రాన్ని కర్రతో దొంగిలించాడు. దేవాలయంలో ఉన్న సీసీ కెమెరాలను ఆధారంగా దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. నిందితుడు దొంగతనానికి రెండు రోజుల ముందు రెక్కీ నిర్వహించినట్లు గుర్తించారు. నిందితుడి వివరాలు సేకరించగా సంగారెడ్డి జిల్లా బుద్దేరా గ్రామానికి చెందిన వడ్డే పోషయ్య అలియాస్‌ రాజుగా గుర్తించారు. ఈనెల 2న నిందితుడిని ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిపై 30 పాత కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి బంగారు మంగళసూత్రాన్ని రికవరీ చేశారు. ఈ కేసు ఛేదించిన క్రైం బృందాన్ని సీఐ అభినందించారు.

ఎల్లమ్మా.. నీవే దిక్కమ్మ


గుడిగంట మోగిస్తున్న భక్తులు


కోనేరులో స్నానాలు చేస్తున్న భక్తులు


బోనంతో యువతి


నెత్తిన బోనాలతో మహిళలు

భక్తిశ్రద్ధలతో నాలుగోరోజు పోలెపల్లి జాతర

బొంరాస్‌పేట: పోలెపల్లి ఎల్లమ్మ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు ప్రత్యేక పూజలు అందుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఒక్కపొద్దులతో వచ్చినవారు తలనీలాలు సమర్పించి, కోనేరులో స్నానమాచరించారు. బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. దేవాలయ కమిటీ చైర్మన్‌ జయరాములు, కమిటీ సభ్యుడు, రేణుకఎల్లమ్మ యువజన సంఘం అధ్యక్షుడు బుగ్గప్ప తదితరులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

పోలియో రహిత సమాజానికి కృషి

చిలుకూరు బాలాజీ దేవాలయ అర్చకుడు రంగరాజన్‌


ఆలయ ప్రాంగణంలో పోలియో చుక్కలు వేస్తున్న అర్చకుడు రంగరాజన్‌

మొయినాబాద్‌: పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్‌ అన్నారు. మండల పరిధిలోని బాలాజీ ఆలయ ప్రాంగణంలో ఆదివారం చిన్నారులకు ఆయన పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్స్‌ పోలియో కార్యక్రమంపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రద్దీ ప్రదేశాల్లో పోస్టర్లు, బ్యానర్లు ప్రదర్శించాలన్నారు. ప్రభుత్వం మారుమూల గ్రామాలు, గిరిజన ప్రాంతాలు, మత్స్యకార ప్రాంతాలలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పోలియో చుక్కలు వేయిస్తున్నారన్నారు. తల్లిదండ్రులు కూడా తమ బాధ్యతగా ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో వేయించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కొత్తూరు: రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్‌ రైల్వేస్టేషన్‌లో ఆదివారం చోటు చేసుకుంది. రైల్వే కానిస్టేబుల్‌ మల్లేశ్‌ తెలిపిన వివరాల మేరకు.. గుర్తు తెలియని మృతదేహం తిమ్మాపూర్‌ రైల్వేస్టేషన్‌ సమీపంలో పట్టాలపై ఉందనే సమాచారంతో అక్కడకు చేరుకున్నారు. సుమారు 35 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహం ఉంది. పట్టాలు దాటుతుండగా ప్రమాదం జరిగినట్లు ఆయన అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్‌ ఆస్పత్రికి తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

కష్టేఫలి

నాలుగు ఉద్యోగాలకు ఎంపిక


కొత్త కార్తికేయ

తాండూరు రూరల్‌: మండల పరిధిలోని మల్కాపూర్‌ గ్రామానికి చెందిన కొత్త కార్తికేయ నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. కొత్త తుల్జప్ప, లక్ష్మి దంపతుల కుమారుడు కార్తికేయ. ఆయన మొదటినుంచి ప్రభుత్వ పాఠశాల్లో చదివారు. కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించారు. గురుకులంలో పీజీటీ బయోసైన్స్‌, టీజీటీ బయోసైన్స్‌, టీజీటీ సైన్స్‌, ఏకలవ్య మోడల్‌ రెసిడెన్సియల్‌ స్కూల్‌ సైన్స్‌ టీచర్‌ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ కార్తికేయను చదివించారు. నాలుగు ఉద్యోగాలకు ఎంపిక కావడంతో గ్రామస్తులు కార్తికేయను అభినందించారు.

చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తాం


కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని సన్మానించిన నాయకులు

మాజీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేరును ప్రకటించటంతో చేవెళ్లలో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం స్థానిక బీజేపీ కార్యాలయం వద్ద టపాసులు కాల్చి వేడుకలు నిర్వహించారు. చేవెళ్ల మీదుగా పరిగి వెళ్తున్న విశ్వేశ్వర్‌రెడ్డిని చేవెళ్లలో ఆపి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కొండా మాట్లాడుతూ.. చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తామన్నారు. కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలని సూచించారు. కష్టపడి పని చేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అనంతర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శర్వలింగం, బీజేపీ నాయకులు వైభవ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాస్‌, నవీన్‌, జైపాల్‌, రవి, జగదీశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహేందర్‌, భార్గవ్‌ ఉన్నారు.

చేవెళ్ల ష'కారు'పై సందిగ్ధం!

- రంజిత్‌రెడ్డి పోటీకి వెనుకాడుతున్నట్లు ప్రచారం
- పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న వైనం


గడ్డం రంజిత్‌రెడ్డి, ఎంపీ

చేవెళ్ల: చేవెళ్ల పార్లమెంట్‌ అభ్యర్థులను ఆయా పార్టీలు ప్రకటిస్తుండటంతో బీఆర్‌ఎస్‌ పార్టీ అభ్యర్థి సిట్టింగ్‌ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి పోటీ విషయంలో జోరుగా చర్చ జరుగుతోంది. సిట్టింగ్‌ ఎంపీగా బీఆర్‌ఎస్‌ పార్టీ నుంచి డాక్టర్‌ గడ్డం రంజిత్‌రెడ్డి ఉన్నారు. ఆయనకే మళ్లీ పార్టీ టికెట్‌ ఇస్తుందని ముందుగానే ప్రకటించారు. రంజిత్‌రెడ్డి పోటీలో ఉంటే చేవెళ్లలో ఎంపీగా గెలుపు ఖాయమనే మొదట్లో చర్చ సాగింది. ప్రస్తుతం ఆయన బరిలో ఉంటారా ఉండరా అనే సందిగ్ధం నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల తరువాత అధికారంలోకి కాంగ్రెస్‌ ప్రభుత్వం రావటంతో చేవెళ్ల రాజకీయాలు రోజు రోజుకు మారిపోతున్నాయి. బీఆర్‌ఎస్‌ పార్టీ నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లోకి జంప్‌ చేస్తున్నారు. దీనికి తోడు చేవెళ్ల ఎంపీగా కాంగ్రెస్‌ పార్టీ నుంచి పట్నం మహేందర్‌రెడ్డి సతీమణి వికారాబాద్‌ జెడ్పీ చైర్‌పర్సన్‌ సునీతారెడ్డి పేరు తెరపైకి వచ్చింది. ఆమె పేరునే దాదాపు పార్టీ ప్రకటించే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఇన్నాళ్లుగా బీఆర్‌ఎస్‌ పార్టీలో కలిసి ఉన్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డిలు ప్రత్యర్థులు అయ్యే అవకాశం ఉంది. ఇరువురూ వ్యాపారాలు కూడా కలిసే చేస్తున్నారు. చేవెళ్లలోని మెడికల్‌ కళాశాలలో ఇద్దరి భాగస్వామ్యం కూడా ఉండటంతో ఇప్పుడు ఎంపీ పోటీలో వీరిద్దరే ప్రత్యర్థులుగా ఉండేందుకు ఇష్టపడటం లేదు. పార్టీలు వేరవడంతో అభ్యర్థులు వీరే అవుతున్నారు. అందుకే బీఆర్‌ఎస్‌ నుంచి ఎంపీ రంజిత్‌రెడ్డి పోటీ చేసేందుకు వెనకడుగు వేస్తున్నట్లు సమాచారం.

మౌనంగానే ఎంపీ

కాంగ్రెస్‌పార్టీలో సునీతారెడ్డి, మహేందర్‌రెడ్డి వర్గీయులు చేరిన నాటి నుంచే చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డి మౌనం వహించారు. దీంతో ఆయన వారిపై పోటీలో ఉండే అవకాశాలు లేవని జోరుగా చర్చ సాగుతోంది. రంజిత్‌రెడ్డి కాకపోతే బీఆర్‌ఎస్‌ పార్టీ నుంచి పోటీలో ఎవరు ఉంటారనేది ఇప్పుడు ప్రశ్నగా మారింది. దీనిపై కూడా నియోజకవర్గంలో జోరుగా చర్చలు జరుగుతున్నాయి. ఎంపీ రంజిత్‌రెడ్డి సైతం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ పార్టీని వీడే నాయకుల విషయంలో ఎలాంటి స్పందన లేకపోవటంతో పాటు వారిని మరవద్దని కూడా చెప్పకపోవటంతో పార్టీ కార్యక్రమాలు కూడా పెద్దగా చేపట్టకపోవటంతో ఆయన పోటీకి వెనకడుగు వేస్తున్నారనే వార్తలను నిజం చేస్తున్నాయి. ఇప్పటికే బీజేపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేరు ఖరారైంది. అయితే ఇక కాంగ్రెస్‌ అభ్యర్థిగా సునీతారెడ్డి పేరును అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. బీఆర్‌ఎస్‌ నుంచి ప్రకటించిన రంజిత్‌రెడ్డి పరిస్థితి అగమ్యగోచరంగా మారటంతో కారుపార్టీ గందరగోళంలో పడింది. రంజిత్‌రెడ్డి సైతం పార్టీ మారే ఆలోచనలో ఉన్నాడని నియోజకవర్గంలో ఊహాగానాలు వ్యక్తమయ్యాయి. నియోజకవర్గాల్లో ఉన్న ఆయన వర్గీయులు సైతం ఈ వార్తలపై ఎలాంటి చర్చలు చేయకుండా మౌనంగా ఉండిపోతున్నారు. దీంతో బీఆర్‌ఎస్‌ పార్టీలో ఏమి జరుగుతుందని.. ఎంపీ అభ్యర్థిగా ఎవరు ఉంటారనే విషయాలు తెలియక పార్టీ నాయకుల్లో, కార్యకర్తల్లో కూడా అయోమయం అలముకుంది. దీనిపై పార్టీ ఎమ్మెల్యేలు కాని, ఎంపీ కాని ఎలాంటి స్పష్టతను అందించటం లేదని కార్యకర్తలు వాపోతున్నారు. నేడే రేపో కేసీఆర్‌ ప్రకటించే బీఆర్‌ఎస్‌ ఎంపీ సీట్ల జాబితాలో చేవెళ్ల ఎంపీ సీటు పేరు ఎవరిది ఉంటుందో చూడాలి.

అతివేగం.. రైతుకు యమపాశం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


భిక్షపతి (ఫైల్‌)

కందుకూరు: రోడ్డు ప్రమాదం ఆ కుటుంబానికి అంతులేని విషాదాన్ని మిగిలించింది. భర్తను కోల్పోయిన ఆ భార్యను పుట్టెడు దుఃఖంలోకి నెట్టింది. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కందుకూరుకు చెందిన కొమ్మగళ్ల భిక్షపతి(46) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆదివారం ఉదయం బైక్‌పై కందుకూరు చౌరస్తాకు వెళ్తున్నారు. మార్గమధ్యలో మేకల మండి వద్ద ఎదురుగా అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన టిప్పర్‌ ఆయన నడుపుతున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. టిప్పర్‌ డ్రైవర్‌ పీఎస్‌లో లొంగిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి భార్య లింగమ్మ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు సీఐ మక్బూల్‌జానీ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



కల్వర్టు శిథిలం.. ప్రయాణం నరకం

కల్వర్టు శిథిలావస్థకు చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. మండలంలోని నంది వాగు ప్రాజెక్టు కుడి కాలువపై ఉన్న కల్వర్టు కూలిపోయేందుకు సిద్ధంగా ఉండడంతో కాస్లబాదు గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టు నుంచి గ్రామానికి రాకపోకలు చేయాల్సి ఉండడంతో ఎప్పుడు కూలిపోతుందోనని గ్రామస్తులు గుబులు పడుతున్నారు. ఇటీవల స్థానికంగా సీసీ రోడ్ల నిర్మాణం కోసం భారీ వాహనాలలో కంకర, ఇసుక తీసుకురావడంతో పురాతన కల్వర్టు కుంగిపోయింది. నందివాగు ప్రాజెక్టు కుడి కాలువపై ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిన సమయంలో ఈ కల్వర్టును నిర్మించారు. దీంతో అప్పటినుంచి మరమ్మతుకు నోచుకోక శిథిలావస్థకు చేరింది. రాకపోకలకు, పంట పొలాలకు సాగు నీరందించేందుకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నూతన కల్వర్టును నిర్మించాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.
– మోమిన్‌పేట